నేడు ప్రత్యేక లోక్ అదాలత్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మోటారు ప్రమాద, రెవెన్యూ కేసుల రాజీకి ఈనెల 21న ప్రత్యేక లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. మోటారు ప్రమాదాల కేసుల పిటిషనర్ న్యాయవాదులు, ఇన్సూరెన్స్ కంపెనీల స్టాండింగ్ కౌన్సిల్‌తో జిల్లా కోర్టులో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయడానికి వ్యక్తిగత శ్రద్ధ వహించాలని కోరారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, ఇన్సూరెన్స్ కంపెనీ స్టాండింగ్ కౌన్సిల్ మంచు జనార్ధనరావు, పి.వి రమణారావు, ఎన్.వి శేషగిరిరావు, పిటిషనర్ తరపు అడ్వకేట్లు కె.రాంబాబు నాయుడు, అంబటి ప్రకాష్, కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లుగా ఏం చేస్తున్నారు..?

- వంశధార శివారు భూములకు సాగునీరు ఇవ్వలేకపోయారు
- వ్యవసాయ సలహా మండలి సమావేశంలో అధికారులపై మంత్రి అప్పలరాజు ఆగ్రహం

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార శివారు భూములకు సాగునీరు ఇవ్వకుండా ఐదేళ్లుగా ఏం చేస్తున్నారని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అధికారులను ప్రశ్నించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. వంశధార కాలువల ద్వారా ప్రస్తుత ఖరీఫ్‌లో సాగునీరు అందించిన వివరాలను వంశధార ఎస్ఇ డోల తిరుమలరావు వివరించిన తర్వాత ఆయన మాట్లాడారు. ప్రతి సమావేశంలో చెప్పిన మాటలనే చెప్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగునీటి సమస్యలపై చివరి క్షణంలో చెప్తున్నారని, రూల్ ప్రకారం చేయమని చెప్తున్నా ఎవరూ చేయడం లేదన్నారు. వంశధారలో నీరున్నా ఇవ్వలేకపోయారని విమర్శించారు. వంశధార సాగునీటిపై వివరణల్లో ప్రగతి ఉందని, సాగునీరు మాత్రం ఇవ్వలేకపోయారని చెప్పారు. సాగునీరు ఇవ్వకుండా తప్పించుకోవడం సరికాదంటూ ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్ జోక్యం చేసుకుంటూ సాగునీటికి సంబంధించి కొన్ని అంశాలను నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. వంశధార కాలువల ఆధునీకరణ, గొట్టాబ్యారేజీ మరమ్మతులు, షట్టర్లు వంటి దీర్ఘకాలిక సమస్యలు ఉన్నాయని తెలిపారు. వీటిని ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నామని చెప్పారు. వంశధార ఎస్ఇ డోల తిరుమలరావు మాట్లాడుతూ వంశధార కాలువల పరిస్థితి బాగాలేదన్నారు. గత కుడి, ఎడమ కాలువల కోసం రూ.పది కోట్లు కావాలని ప్రభుత్వాన్ని రెండేళ్ల కిందటే అడిగామని, ప్రభుత్వం ఇప్పటివరకు నిధులు విడుదల చేయలేదని వివరించారు. షట్టర్లు బాగాలేవని, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని చెప్పడంతో మంత్రి అప్పలరాజు చల్లబడ్డారు.

ఖరీఫ్‌లో పంటలు వేయలేకపోయిన రైతులు నష్టపోకుండా ఏదోరకమైన ప్రయోజనం దక్కేలా చూడాలని వ్యవసాయశాఖ జెడి శ్రీధర్‌కు సూచించారు. పరిహారం కోసం నిబంధనలు, మార్గదర్శకాలు అని చూడకుండా రైతులకు ఇన్సూరెన్స్ వచ్చేలా చూడాలని చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోళ్లకు ఈ సంవత్సరం ఎటువంటి లక్ష్యం, పరిమితి లేదని, పండిన ధాన్యమంతా కొనుగోలు చేస్తామని చెప్పారు. ధాన్యం రవాణా చేసే వాహనాలకు జిపిఎస్ పరికరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నేతాజీ, డిసిఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, వ్యవసాయ శాస్త్రవేత్త ఎ.సత్యనారాయణ, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ దీక్షలు భగ్నం

శ్రీకాకుళం, పలాసలో పది మంది అరెస్టు, విడుదల

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ కుమార్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పలాస, టెక్కలి రూరల్

సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద రెండు రోజులుగా చేపడుతున్న యుటిఎఫ్ నిరవధిక నిరాహార దీక్షలను పోలీసులు శుక్రవారం భగ్నం చేశారు. సాయంత్రం 5.30 గంటల సమయంలో వాహనాలతో దీక్షా స్థలికి చేరుకున్న పోలీసులు, దీక్షలో కూర్చున్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, నాయకులు ఎల్.బాబూరావు, వై.ఉమాశంకర్, జి.నారాయణరావు, పి.ఉమాభాస్కర్‌ను ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు.

పలాస మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో యుటిఎఫ్ ఆధ్వర్యాన చేపట్టిన నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేశారు. దీక్షలో కూర్చొన్న ఐదుగురు యుటిఎఫ్ నాయకులను బలవంతంగా వాహనాల్లో ఎక్కించి కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. పోలీస్‌స్టేషన్‌లో యుటిఎఫ్ నాయకులను సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, ఎపిటిఎఫ్ (1938) నాయకులు జి.సుభాష్, ఎపి ఎన్‌జిఒ మండల అధ్యక్షులు బి.గోపాల్, అరుణ్ కుమార్ పాడి సంఘీభావం తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర మాట్లాడుతూ సిపిఎస్ కంటే నష్టదాయకమైన జిపిఎస్ విధానంతో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసగిస్తోందన్నారు.



పలాస : కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో యుటిఎఫ్ నాయకులు

టెక్కలి ఇందిరాగాంధీ జంక్షన్ వద్ద చేపట్టిన నిరాహార దీక్షకు సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పొందూరు అప్పారావు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు.

మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారం అవసరమని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. డ్రగ్స్ జీవితాన్ని నాశనం చేయడంతో పాటు భవిష్యత్ లేకుండా చేస్తుందని... విద్యార్థులు, యువత దీన్ని గ్రహించి వాటికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో అందరి సహకారం అవసరమన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ చైర్మన్‌గా ఉండే ఈ కమిటీకి కన్వీనర్‌గా ఎస్‌పి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్, సబ్ కలెక్టర్, ఆర్‌డిఒలు, డిఇఒ, డిఎంహెచ్, జిల్లా వ్యవసాయాధికారి సభ్యులుగా ఉంటారని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం శతశాతం లేకుండా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగంపై కళాశాలల యాజమాన్యాలు దృష్టిసారించాలన్నారు. తల్లిదండ్రులకు పిల్లలపై నియంత్రణ లేక డ్రగ్స్, గంజాయి బానిసలవుతున్నారని చెప్పారు. డ్రగ్స్ వినియోగంపై ఎవరి వద్దనైనా సమాచారం ఉంటే, స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని సూచించారు. గంజాయి వినియోగం వల్ల అనర్థాలపై జిల్లావ్యాప్తంగా తరచుగా సదస్సులు నిర్వహించాలన్నారు.

జిల్లాలో గంజాయి సాగు లేదని, కొన్ని ప్రాంతాల్లో వినియోగం ఉన్నట్టు సమాచారం ఉందని ఎస్‌పి జి.ఆర్ రాధిక తెలిపారు. వినియోగం, రవాణాపై గట్టి నిఘా ఉంచామన్నారు. ఒడిశా నుంచి ఇవి జిల్లాకు రాకుండా రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిరంతర వాహన తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు. ఎస్ఇబి, రైల్వే అధికారులను సమన్వయం చేసుకుంటూ గంజాయి రవాణా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ట్రాన్స్‌పోర్టు, పార్సిల్ సర్వీసులు రవాణా జరిగే సరుకులు వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలని నోటీసులు ఇచ్చామన్నారు. రాత్రివేళల్లో లాడ్జీల తనిఖీలు నిర్వహించి కొత్త వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఇబి జెడి ఎన్.మణికంఠ, ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, డిఎంహెచ్ఒ బి.మీనాక్షి, ఆర్‌డిఒలు బి.శాంతి, సీతారామ్మూర్తి, డ్రగ్ కంట్రోలర్ ఎడి, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న రైతుసంఘం నాయకులు, రైతులు

పలాస డివిజన్‌ను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

పలాస : పలాస రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై పలాస ఆర్‌డిఒ కార్యాలయం వద్ద రైతుసంఘం ఆధ్వర్యాన శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో సోంపేట, కంచిలి, ఇచ్ఛాపురం, కవిటి ప్రాంతాల్లో ఉబాలు వేయలేదన్నారు. వరి పంట పొట్ట దశలో ఉందని, ఈ సమయంలో వంశధార నీరు శివారు భూములకు అందడం లేదన్నారు. దీంతో కొందరు రైతులు చెరువులు, కుంటలు, వాగులో మోటారు ఇంజినర్లతో సాగునీరు పెట్టుకుంటున్న దయనీయ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం, కనీసం సాగునీరు అందించలేని పరిస్థితుల్లో ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక వంశధార శివారు భూములకు సాగునీరు అందించకపోగా, రైతుల నుంచి దౌర్జన్యంగా నీటితీరువా వసూలు చేస్తోందని విమర్శించారు. రబీకి విత్తనాలు ఉచితంగా పంపిణీ చేయాలని, పంటరుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఉపాధి హామీలో 200 రోజులు పని కల్పించాలని, రోజుకు రూ.600 కూలి చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ పి.బాలకు వినతిపత్రం అందజేశారు. ధర్నాకు సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, గిరిజన సంఘం నాయకులు ఎస్.ఫల్గుణరావు సంఘీభావం తెలిపారు. రైతుసంఘం నాయకులు కె.బాలాజీరావు, కె.హేమసూదన్, టి.భాస్కరరావు, పి.సాంబమూర్తి, జి.గోవింద్, వ్య.కా.స నాయకులు డి.భాస్కరరావు, డి.భానమ్మ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు ఇక సులభతరం

- మున్సిపల్ చట్టానికి సవరణలు
- రెవెన్యూ మంత్రి ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఇళ్ల నిర్మాణాల అనుమతులను మరింత సులభతరం చేసేలా ప్రభుత్వం మున్సిపల్ చట్టానికి పలు సవరణలు చేసిందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. స్థానిక కళ్యాణ మండపంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రోడ్డు తక్కువ వెడల్పు ఉన్నా స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేందుకు పట్టణ ప్రణాళిక నిబంధనల్లో పలు మార్పులు చేశామని చెప్పారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం రోడ్డు వెడల్పు 30 అడుగులు ఉండాలని, అంతకన్నా తక్కువ ఉన్న చోట బిల్డింగ్ అనుమతులు వచ్చే పరిస్థితి లేదన్నారు. ఇరుకుగా ఉన్న రోడ్లను అలానే వదిలేసి, వీలున్నంత మేరకు స్థానిక అవసరాల దృష్ట్యా రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. రోడ్డు వెడల్పు 30 అడుగులు ఉన్నా, లేకపోయినా పది అడుగులు కన్నా తక్కువ ఉన్న చోట కూడా అక్కడున్న భవన యజమానుల రహదారికి వీలున్నంత మేర స్థలం ఇచ్చి ఇళ్ల నిర్మాణాలను సాగించేందుకు మార్పులు చేశామని తెలిపారు. సంతోషిమాత కోవెల నుంచి చాకలివీధి వరకు ఇరుకుగా ఉన్న రోడ్లను వీలున్నంత మేర అభివృద్ధి చేసి భవన నిర్మాణదారులకు అనుమతులు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు.

గతంలో మాదిరిగా తక్కువ స్థలంలో ఇళ్ల నిర్మాణం సాధ్యం కాదన్న ప్రశ్నే తలెత్తదని చెప్పారు. నగరవ్యాప్తంగా ఇరుకుగా ఉన్న వీధులను గుర్తించామని, వాటిలో ఇళ్ల నిర్మాణం ఇక సులువు కానుందన్నారు. కొంతమంది అవగాహన లేక నిబంధనలను అతిక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని, వాటిని అధికారులు గుర్తించి తొలగిస్తున్నారని చెప్పారు. కొత్త భవనాల నిర్మాణాల ద్వారానే స్థానిక సంస్థలకు ఆదాయం వస్తుందని, నిధులు సమకూరాలంటే కొత్త నిర్మాణాలు జరగాలని అభిప్రాయపడ్డారు. కొత్త నిర్మాణాలు సాగాలంటే నిబంధనలు సవరించాల్సి ఉంటుందని చెప్పారు. నగరవ్యాప్తంగా 23 ప్రాంతాల్లో అక్కడున్న రోడ్డు వెడల్పుకు అనుగుణంగా భవన నిర్మాణదారులు స్థలం వదిలే విధంగా ఇప్పటి నిబంధనలు మార్చామని తెలిపారు. దీన్ని ప్రజలు ఉపయోగించుకుని నిబంధనలకు అనుగుణంగా భవన నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనా సమగ్రతను కాపాడాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ మారణకాండ ఆపాలని, పాలస్తీనా సమగ్రతను కాపాడాలని కోరుతూ అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం ఆధ్వర్యాన నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద శుక్రవారం శాంతిప్రదర్శన చేపట్టారు. మారణకాండకు నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసు మాట్లాడుతూ అమెరికా అండతో ఇజ్రాయిల్ దాడి కొనసాగిస్తోందన్నారు. యుద్ధం ద్వారా కాకుండా చర్చల ద్వారా పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, షేక్‌జిలానీ, షానూ, సిరా, పలు ప్రజాసంఘాల నాయకులు సిహెచ్.గోవిందరావు, టి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన సామాజిక బాధ్యత

శ్రీకాకుళం అర్బన్ : బాల్య వివాహాల నిర్మూలనను సామాజిక బాధ్యతగా తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. మిషన్ వాత్సల్య కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్న వయసులో వివాహంతో బాలికల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ప్రసవానంతర శిశు మరణాల రేటు పెరుగుతుందని, పుట్టే పిల్లల శారీరక ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు. వీటిని నివారించేందుకు గ్రామస్థాయి నుంచి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. బాల్య వివాహాలు నేరమని, ఇందుకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా ఉంటుందని చెప్పాలన్నారు. బాల్య వివాహంపై సమాచారాన్ని 112, చైల్డ్‌లైన్ హెల్ప్‌లైన్ 1098 నంబరుకు తెలియజేయాలని కోరారు. 2030 నాటికి బాల్య వివాహ రహిత భారతదేశమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమన్నారు. తొలుత బాల్య వివాహాల నిర్మూలనకు కట్టుబడి ఉంటామని అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. బాల్య వివాహాలను అరికట్టేలా రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు, ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, గ్రామ సచివాలయాల ప్రత్యేక అధికారి వాసుదేవరావు, డిపిఆర్ చెన్నకేశవ, డిఎంహెచ్ఒ బి.మీనాక్షి పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగుల స్పందనకు 9 వినతులు

శ్రీకాకుళం అర్బన్ : కలెక్టరేట్‌లోని డిఆర్ఒ ఛాంబర్‌లో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగుల స్పందనకు తొమ్మిది వినతులు వచ్చాయి. వినతులను జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు స్వీకరించారు. గత నెల వేతనాలు ఇంతవరకు చెల్లించలేదని పలువురు ఉపాధ్యాయులు ఫిర్యాదు చేశారు. జీతభత్యాలు అందలేదని, సీనియారిటీ, ఉద్యోగోన్నతులు, ఇంక్రిమెంట్లు తదితర సమస్యలపై వినతులు అందజేశారు. ప్రతినెలా మూడో శుక్రవారం నిర్వహించే ఉద్యోగుల స్పందనలో వచ్చిన సమస్యల పరిష్కారానికి సంబంధిత ఉన్నతాధికారులకు పంపుతామని డిఆర్ఒ తెలిపారు.

మీ త్యాగం అజరామరం

నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

తమ కోసం బతికేవాడు కాదు.. పది మంది కోసం ప్రాణాలర్పించే వాడే నిజమైన అమరుడు..! విధి నిర్వహణలో ప్రాణాలు సైతం లెక్క చేయక, ప్రజల భద్రత కోసం అహర్నిశలూ శ్రమించే వాడే జవాను. తీవ్రవాదులు పెచ్చరిల్లినా.. ముష్కరులు విరుచుకుపడినా.. శత్రు దేశాలు దండెత్తినా.. మడమ తిప్పక పోరాడే రక్షక భటునికి సలాం చేయాల్సిందే. అలా పలు పోరాటాల్లో అశువులు బాసిన జిల్లాకు చెందిన పలువురు అమరవీరులను ఈ రోజున స్మరించుకుంటూ ప్రత్యేక కథనం. - ప్రజాశక్తి, శ్రీకాకుళం

సంస్మరణ దినోత్సవం ఆవిర్భవించిందిలా..

1959 సంవత్సరం అక్టోబరు 21న భారత్- చైనాల మధ్య సియాచిన్ సరిహద్దులో లఢక్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న మన జవాన్లపై చైనా జవాన్లు దాడి చేయడంతో పది మంది అమర వీరులయ్యారు. నాటి నుంచి ఏటా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా మారింది.

పేదింట పుట్టి...

పొందూరు మండలంలోని లోలుగు గ్రామంలో 1976 ఏప్రిల్ 15న మజ్జి చిన్నవాడు దంపతులకు ఎస్.వి రమణ జన్మించాడు. వారిది నిరుపేద కుటుంబం. 1998 సంవత్సరం సెప్టెంబరు ఒకటో తేదీన కానిస్టేబుల్‌గా విధుల్లో చేరి, స్పెషల్ పార్టీలో చురుకైన విధులు నిర్వహిస్తూ ఉన్నతాధికారుల మన్ననలు పొందాడు. నులకజోడు గ్రామంలో సుమారు 200 మంది నక్సలైట్లు రైసు మిల్లులో దోపిడీ చేసి బియ్యం బస్తాలు ఎత్తుకెళ్లిపోయారు. దానిపై కూంబింగ్‌కు వెళ్లిన స్పెషల్ పార్టీకి చేదు అనుభవం ఎదురైంది. 2001 సంవత్సరం అక్టోబరు 27న నడిమిగూడ వద్ద నక్సల్స్ అమర్చిన మందుపాతర పేలి వెంకటరమణ మృతిచెందాడు.

నక్సలైట్ల వేటలో...

జిల్లా చరిత్రలో తొలిసారిగా 1992 సంవత్సరంలో నక్సల్స్ ఘాతకానికి ఎస్ఐ బంగారు నాయుడు బలయ్యాడు. విజయనగరం జిల్లా డెంకాడ మండలం గుణుపూరుపేటకు చెందిన ఆయన బారువా, కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో పనిచేశారు. మందస మండలం రట్టి, బేతాళపురం గ్రామాల మధ్య కొండల్లో నక్సలైట్లు ఉన్నారనే సమాచారం రావడంతో అక్కడకు వెళ్లారు. మార్చి 23వ తేదీన ఉద్దానం దళానికి చెందిన నక్సలైట్లు జరిపిన కాల్పుల్లో మృతి చెందాడు.

సమాచార సేకరణలో దిట్ట

నక్సలైట్ల సమాచార సేకరణలో దిట్టగా పేరుగాంచిన నరేంద్రదాసు, వారి ఉద్యమాలను నీరుగార్చేందుకు విశేషమైన కృషి చేసేవాడు. నక్సలైట్ల కదలికలను గమనించి, వారి ఆకృత్యాలను నిరోధించడంలో దాసు సఫలమవుతుండటాన్ని నక్సల్స్ సహించలేకపోయారు. 1997 మార్చి 17వ తేదీన కాశాబుగ్గలో దైవదర్శనానికి వెళ్లిన దాసును పిస్టోల్‌తో కాల్చి చంపారు. 1971లో పోలీసుశాఖలో చేరిన దాసు స్పెషల్ బ్రాంచి ఇంటెలిజెన్స్ విభాగాల్లో సమర్థవంతమైన సేవలు అందించారు.

రక్షణ కల్పిస్తూ ప్రాణాలు వదిలి..

పలాస మండలం నీలిభద్రలో ఒక వ్యక్తిని హతమార్చి, ఆస్తిని దోచుకునేందుకు నక్సలైట్లు ప్రణాళిక వేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆయనను రక్షించేందుకు ఇంటి వద్ద పికెట్ ఏర్పాటు చేశారు. దానికి ఇన్‌ఛార్జిగా హెడ్‌కానిస్టేబుల్‌గా అన్నెపు పాపారావు వ్యవహరించారు. 1997 జూలై 17వ తేదీ అర్ధరాత్రి తుపాకీలతో నక్సలైట్లు విరుచుకుపడ్డారు. పాపారావు ఎదురుకాల్పులు జరిపి, వీరోచితంగా పోరాడాడు. నక్సల్స్ తూటాలకు నేలకొరిగాడు. 1971 పోలీసు శాఖలో పాపారావు సర్వీసు ప్రారంభించారు. 1948లో ఫిబ్రవరి 9వ తేదిన కోటబొమ్మాళి మండలం జర్జంగిలో జన్మించారు.

దారికాచి మట్టుబెట్టారు

నక్సలైట్ల కార్యకలాపాల సమాచార సేకరణలో ఆరితేరిన కృష్ణమూర్తిని దారికాచి మట్టుపెట్టారు. 1970 మార్చి 15న సంతకవిటి మండలం వాల్తేరులో పి.బోడయ్య దంపతులకు కృష్ణమూర్తి జన్మించాడు. 1993లో కానిస్టేబుల్‌గా పోలీసుశాఖలో చేరాడు. నక్సలైట్ల ఏరివేతలో చురుకైన పాత్ర పోషిస్తూ శాంతి భద్రతలను పరిరక్షించేవాడు. దీన్ని జీర్ణించుకోలేని నక్సలైట్లు మాటువేసి కాల్చి చంపారు. 2000 సంవత్సరం జూన్ 5న మందస మండలం, హరిపురం కూడలిలో ఈ ఘాతుకం చోటుచేసుకుంది.

ఇంటింటికీ మంచినీటి కుళాయిలు

ప్రజాశక్తి - పొందూరు

ఆమదాలవలస నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా తాగునీరు, అన్ని వీధుల్లో సిసి రోడ్లు వేస్తామని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కేశవదాసుపురంలో జల జీవన్ మిషన్ నిధులు రూ.70 లక్షలతో ఇంటింటికీ తాగునీటి కుళాయిలకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. సిహెచ్ఎఫ్ నిధులు రూ.50 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ పాఠశాలలో నాడు-నేడు నిధులు రూ.19.83 లక్షలతో మౌళిక వసతుల నిర్మాణాలను ప్రారంభించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రాపాకలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, వైస్ ఎంపిపి ప్రతినిధి వి.వెంకటరావు, వైసిపి మండల కన్వీనర్ పప్పల రమేష్ కుమార్, జెసిఎస్ కన్వీనర్ బాడాన వెంకట కృష్ణారావు, ఎఎంసి చైర్మన్ బి.సునీల్, సర్పంచ్ ఎం.శంకరరావు, కె.వనజ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస పురపాలక సంఘం

రేఖా నెం.312/2022-ఇ1, **ఇ - ప్రొక్యూర్‌మెంటు టెండరు నోటీసు** తేది:20-10-2023

ఆమదాలవలస పురపాలక సంఘం పరిధిలో ఈ దిగువ తెలిపిన పనులకు ఇ - **ప్రొక్యూర్‌మెంటు** ద్వారా టెండర్లు కోరబడుచున్నవి.

(I) షార్ట్ టెండర్ వర్క్స్: 15వ ఆర్థిక సంఘం నిధులు పనులు సంఖ్య: 3, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు పనుల సంఖ్య: 2, అంచనా కాంట్రాక్ట్ విలువ (5 పనులకు): **రూ. 47,96,093/-**

బిడ్ డాక్యుమెంట్ డౌన్లోడ్ చేయుటకు ప్రారంభ తేది	21-10-2023 ఉ॥11.00 గం॥లకు
బిడ్ డాక్యుమెంట్ డౌన్లోడ్ చేయుటకు ఆఖరు తేది	31-10-2023 మ॥ 1.00 గం॥ లకు
బిడ్ స్వీకరించుటకు ఆఖరు తేది	31-10-2023 మ॥ 4.00 గం॥ లకు
ప్రైస్ బిడ్ తెరుచు తేది	31-10-2023 సా॥ 5.00 గం॥ లకు

(II). 1st Call వర్క్స్: 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులు పనుల సంఖ్య: 3, అంచనా కాంట్రాక్ట్ విలువ **రూ. 30,06,090/-**

బిడ్ డాక్యుమెంట్ డౌన్లోడ్ చేయుటకు ప్రారంభ తేది	21-10-2023 ఉ॥11.00 గం॥లకు
బిడ్ డాక్యుమెంట్ డౌన్లోడ్ చేయుటకు ఆఖరు తేది	09-11-2023 మ॥ 1.00 గం॥ లకు
బిడ్ స్వీకరించుటకు ఆఖరు తేది	09-11-2023 మ॥ 4.00 గం॥ లకు
ప్రైస్ బిడ్ తెరుచు తేది	09-11-2023 సా॥ 5.00 గం॥ లకు

ఇతర వివరములకు ఆఫీసు పనివేళల్లో సంబంధిత విభాగ అధికారులను సంప్రదించి తెలుసుకోవచ్చును.

కమీషనరు
ఆమదాలవలస పురపాలక సంఘం

ఎకరు వినతిపత్రం అందిస్తున్న రైతుసంఘం నాయకులు, గిరిజనులు

గిరిజన భూములకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి- పలాస

మందస మండలం కొండలోగాం పంచాయితీ పట్టులోగాం, చాపరాయి కాలనీ గ్రామ పరిధిలోని గిరిజనుల ఆధీనంలో ఉన్న భూములకు రక్షణ కల్పించాలని, బహిరంగ విచారణ జరిపి గిరిజనులకు న్యాయం చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనారి మోహనరావు డిమాండ్ చేశారు. పలాస ఆర్‌డిఒ కార్యాలయం వద్ద శుక్రవారం గిరిజన రైతుల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం ఎఒ పాముల బాలకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నంబర్ 9 నుంచి 26లో గల 104 ఎకరాల భూమిని గత 50 ఏళ్ళ నుండి గిరిజనులే సాగు చేస్తున్నారని, ఆ భూములపై గిరిజనేతరులు వచ్చి దౌర్జన్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భూములపై బహిరంగ విచారణ జరిపి గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సవర ఫల్గుణరావు, సవర నర్సింగులు, సంజయ్, భాస్కరరావు, ధనుంజయ్, కూర్మారావు, వీరాస్వామి, ఆనందరావు, మోహనరావు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని రణస్థలం పంచాయతీ పిట్టపాలెం గ్రామం నుండి నాగంపాలెం గ్రామం వరకు 1200 మీటర్లు మేర అరబిందో ఫార్మా ఫౌండేషన్ సౌజన్యంతో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ప్రత్యేక చొరవతో శుక్రవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రణస్థలం మండలం జడ్‌పిటిసి టొంపల సీతారాం, జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్ల వెంకటరెడ్డి, వైసిపి నాయకులు మహంతి జోగినాయుడు, పసుపురెడ్డి సురేష్, కిల్లారి సన్యాసినాయుడు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

రైతుభరోసా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- పోలాకి

మండలం చీడివలస గ్రామంలో రూ. 21.80లక్షల నిధులతో చేపట్టిన నూతన రైతు భరోసా కేంద్రం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ డిప్యూటీ సిఎం, జిల్లా పార్టీ అధ్యక్షులు, నరసన్నపేట శాసనసభ్యులు ధర్మాన కష్ణ దాస్, బీసీ సెల్ జోనల్ ఇన్‌ఛార్జి, నరసన్నపేట నియోజకవర్గం యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, పోలాకి మండలం ఎంపిపి ముద్దాడ బైరాగి నాయుడు, వైసిపి నాయకులు కె. కృష్ణారావు, సర్పంచ్ ఎం.రాము, త్రినాథరావు, కణితి సత్తిబాబు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ ఖోఖో పోటీలకు డొంకూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల టెక్కలి వేదికగా జరిగిన బాలబాలికల జిల్లా స్థాయి ఖోఖో ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. వీరి ఎంపికపట్ల ప్రధానోపాధ్యాయులు సరోజిని, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

లెక్కిస్తున్న దేవాదాయశాఖ సిబ్బంది

హుండీ ఆదాయం రూ.20.12 లక్షలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

స్థానిక శ్రీ కొత్తమ్మతల్లి జాతర ఉత్సవాల ద్వారా మంగళ, బుధ, గురువారాల్లో రూ. 20,12,242 లు ఆదాయం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ధర్మహూండీలను దేవాదయ శాఖాదికారులు, ట్రస్టు బోర్డు సభ్యుల సమక్షంలో లెక్కించారు. స్పెషల్ దర్శనం టిక్కెట్లు ద్వారా రూ.3లక్షల 40వేలు, మొక్కుబడి రుసుము ద్వారా రూ.5లక్షల 19,700, అంతరాలయం టిక్కట్లు ద్వారా రూ. 1,52.800, విరాళాలు ద్వారా రూ. 1601, హూండీల ద్వారా రూ. 9,98,142 ఆదాయం లభించిందన్నారు. గతేడాది ఉత్సవాలు ద్వారా ఆదాయం రూ. 16,42,285రాగా ఈ ఏడాది రూ.3,69,957 ఆదాయం అధికంగా లభించిందన్నారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఉత్సవాల ఛీప్ ఫెస్టివల్ అధికారి, హుండీ పర్యవేక్షణ అధికారి జి. ప్రసాద్‌బాబు, కొత్తమ్మతల్లి ఉత్సవ కమిటీ చైర్మన్ బోయిన మాధవి కృష్ణారావు, వైఎస్ ఎంపిపి బోయిన నాగేశ్వరరావు, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

ప్లాంటేషన్ ప్రోగ్రాంతో తోడ్పాటు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్లాంటేషన్ ప్రోగ్రాం సమర్థవంతంగా నిర్వహించాలని, తద్వారా చిన్న, సన్నకారు రైతాంగానికి తోడ్పాటు అందించేందుకు చర్యలు చేపట్టాలని ప్లాంటేషన్ ప్రోగ్రాం జాయింట్ కమిషనర్ ఎ.అశోక్ కుమార్ ఆదేశించారు. డ్వామా కార్యాలయంలో యాజమాన్య సంస్థ కార్యాలయంలో ప్లాంటేషన్ ప్రోగ్రాంపై శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. రైతులకు మొక్కలు ఉచితంగా పంపిణీ చేసి ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. మొక్కలు బతికేలా క్షేత్రస్థాయి పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రణాళిక ప్రక్రియ ప్రస్తుతం చేపడుతున్నందున లబ్ధిదారులను గుర్తించాలన్నారు. జీుఅఝుఅతీవస్త్రు ఖజాజూ ప్రతిఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దీనిద్వారా ఉపాధి హామీ పనితీరు అందరికీ తెలుస్తుందన్నారు. చెరువుగట్లు ప్రభుత్వ భూములు గుర్తించి బ్లాక్ ప్లాంటేషన్ చేపట్టడం ద్వారా గ్రామంలోని పేదవారికి కొంత ఆదాయం వస్తుందన్నారు. భూగర్భ జలాలు పెంచేందుకు వాటర్ హార్వెస్టింగ్ పనులను ఎక్కువగా గుర్తించాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వేతో సమస్యల పరిష్కారం

కవిటి : ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు

ప్రజాశక్తి- కవిటి

ప్రభుత్వం చేపడుతున్న భూ సర్వేతో ఎన్నో భూ సంబంధిత సమస్యలు పరిష్కారమవుతాయని కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. జగనన్న శాశ్విత భూ హక్కు, భూ రక్షణ పథకంపై శుక్రవారం కవిటి సచివాలయం-1లో గ్రామసభ నిర్వహించి అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూ హక్కు పథకంతో రైతులకు మేలు జరుగుతుందని, దశాబ్దాల నుంచి అపరిష్కృతంగా ఉన్న అనేక రకాల భూ సమస్యలకు ఈ కార్యక్రమం పరిష్కారం చూపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పూడి నీలాచలం, పి.జయరాం, ఇఒ వీరభద్రస్వామి, నూకరాజు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

బూర్జ: మండల పరిధిలోని గ్రామాల వారీగా గ్రామ కంఠం గుర్తింపు వేగవంతం చేయాలని వైస్ ఎంపిపి బుడుమూరు సూర్యారావు అధికారులకు సూచించారు. శనివారం మండల పరిధిలో ఒ.వి.పేట ఎంపిటిసి పరిధిలోని ఒ.వి.పేట, లచ్చయ్యపేట గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి శాఖ అనుసంధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా జగనన్న సమగ్ర భూసర్వే పథకాలు ద్వారా ఈ గ్రామకంఠాల గుర్తింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ పథకంతో నిరుపేద రైతులకు, గ్రామీణ ప్రజలకు సంపూర్ణ భూహక్కు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు సూరపు ఉదయ్‌కుమార్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు సింగుపురపు కోటేశ్వరరావు, స్థానిక సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ, కింజరాపు ఆనందరావు, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్ రాములమ్మ

సంతబొమ్మాళి: జగన్నాథపురం గ్రామ పంచాయతీలో సర్పంచ్ జోగి రాములమ్మ ఆధ్వర్యంలో జగనన్న భూ హక్కు భూ రక్షా కార్యక్రమం శుక్రవారం జరిగింది. స్వామిత్వలో భాగంగా జగనన్న భూహక్కు, భూరక్ష పథకంలో గ్రామకంఠం పరిధిలో ఉన్న గృహలకు రికార్డ్స్ ఆఫ్ రైట్స్ కింది పూర్తి హక్కులు కల్పిస్తూ హక్కు పత్రాలు జారిచేయుటకు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీకార్యదర్శి గణపతి, సచివాలయం సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

పశుసంవర్థకశాఖ మంత్రి అప్పలరాజు

పలాస: ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమం అందాలన్నా, గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలన్నా, ప్రభుత్వ పరిపాలన ప్రతి ఇంటి ముంగిట ఉండాలన్నా మళ్లీ జగన్మోహన్ రెడ్డి సిఎం కావాలని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలం పెదంచల గ్రామంలో శుక్రవారం పంచాయతీ స్థాయి వైసిపి నాయకులతో కలిసి పార్టీ విధి విధానాలపై సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు అత్యంత కీలక దశలో ఉందని, ఇప్పుడు అధికారం జగన్ చేతుల్లో నుంచి వెళ్లిపోతే ఎపి అల్లకల్లోలం అయిపోతుందన్న ఉద్దేశంతో గ్రామస్థాయిలో వైసిపి నాయకులతో సమావేశం నిర్వహించామన్నారు. జగన్ మళ్లీ అధికారంలోకి రావడం వల్ల ఏపీకి ఎంత ప్రయోజనమో గ్రామస్థాయిలో ప్రచారం ద్వారా ప్రజలకు వివరించాలని కోరారు. ప్రతి ఓటు మనకు కీలకమని సంబంధిత బూత్ కన్వీనర్ ఓట్లుపై దృష్టి సారించాలని సూచించారు. సర్పంచ్, ఎంపిటిసి బూత్ కన్వీనర్ ఇతర విభాగాల ప్రతినిధులు కలిసి ఓటర్లను గుర్తించాలన్నారు. జగన్ సిఎం కావడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. సమావేశంలో మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ మాధవరావు, వరిశ రామారావు, తలగాన శ్రీరాములు, దువ్వాడ రవికుమార్, బమ్మిడి దుర్యోధన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

కవిటి: స్థానిక లోళ్ల నారాయణమూర్తి కళ్యాణ మండపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన జగన్ మళ్లీ ఎందుకు రావాలి కార్యక్రమం మొక్కుబడిగా సాగింది. రెండు గంటలకు ప్రారంభమవుతుందని చెప్పిన కార్యక్రమం 4.30గంటల వరకు ప్రారంభం కాకపోవడంతో అప్పటికే నిరీక్షిస్తున్న వాలంటీర్లు అసహనానికి గురయ్యారు. ఆతరువాత కూడా స్థానిక నాయకులు అలా వస్తూ.. ఇలా వెళ్తూ కనిపించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి సగానికిపైగా పంచాయతీల నుంచి ఎంపిటిసిలు, నాయకులు హాజరు కాలేదు. సమావేశ మందిరంలో 80 శాతం వాలంటీర్లు మాత్రమే ఉన్నారు. నాయకుల దృష్టంతా రాబోయే బస్సుయాత్రపైనే ఉండడం, దానికి సంబంధించిన విషయాలపైనే ఇక్కడా మాట్లాడుతుండడంతో సమావేశం తూతూ మంత్రంగా ముగించేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, నియోజకవర్గ సమన్వయకర్త సాయిరాజ్, నాయకులు నర్తు నరేంద్ర, దుక్క లోకేశ్వరరెడ్డి, కడియాల ప్రకాష్, పూడి లక్ష్మణరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

పోలీసుల చర్య రాజ్యాంగ విరుద్ధం

ప్రజాశక్తి- ఆమదాలవలస

శాంతియుతంగా తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ నిరాహార దీక్షలు చేస్తున్న ఉపాధ్యాయులను శ్రీకాకుళం, పలాసలో పోలీసులు అతిగా వ్యవహరించి బలవంతంగా నిరాహార దీక్ష శిబిరం నుండి తరలించడం రాజ్యాంగ ప్రాథమిక హక్కులకు విరుద్ధమైనదని పౌర హక్కుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి మోహనరావు పోలీసుల చర్యలను ఖండించారు. పోలీసులు ఉపాధ్యాయుల పట్ల వ్యవహరించిన తీరు అప్రజాస్వామి కమన్నారు. నిర్బంధంలోకి తీసుకున్న ఉపాధ్యాయులను విడిచిపెట్టి నిరాహార దీక్షలు కొనసాగించేందుకు సహకరించాలని మోహనరావు పోలీసు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

సర్వసభ్య సమావేశంలో సమస్యలపై నిలదీత

ప్రజాశక్తి- జి.సిగడాం

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపిపి మీసాల సత్యవతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ పార్టీలకు చెందిన సర్పంచ్‌లు ఎంపిటిసిలు అధికారులను సమస్యలపై నిలదీశారు. పంటలు ఎండుతున్నా జలాశయం ద్వారా సాగునీరు అందించడంలో అధికారులు అలసత్వం వ్యవహరిస్తున్నారని సర్పంచ్‌లు బుడారి లక్ష్మణరావు, వడిశ మహేష్, కామోజుల సీతారాం, బెవర జగన్నాథరావు, మహాదాసం చిన్నారావు, బోగాధి అప్పలనాయుడు వెంకటరావు, అల్లు జోగినాయుడు, గోక మహేష్ అధికారులు నిలదీశారు. ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేపట్టిన సిసి రహదారులు ఎస్‌డబ్ల్యూపిసిలకు బిల్లులు అలసత్వహించడం ఎంతవరకు సమంజసమని మెట్టవలస సర్పంచ్‌లు సీతారాం, అప్పలనాయుడు నిలదీశారు. గ్రామంలో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన బోర్లు విషయంలో తమ ప్రమేయం లేకుండా తమకు సమాచారం అందించకుండా తమకు ఇష్టం వచ్చినట్లు నచ్చిన చోట బోర్లు వేస్తున్నారని సర్పంచ్‌లు ఎఇ బగాది భాగ్యలక్ష్మిపై మండిపడ్డారు. సమస్యలపై ప్రజా ప్రతినిధులను, అధికారులను అడిగితే సమాధానం చెప్పకుండా మాట దాటవేయడం పద్ధతి కాదన్నారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి కాయల రమణ, మండల ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణ, వైస్ ఎంపిపిలు మీసాల సాధ్యమని, టి.వెంకటరావు, తహశీల్దార్ పప్పల వేణుగోపాలరావు, ఎంపిడిఒ నిశ్చల పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విద్యార్థులకు విజ్ఞానం

ప్రజాశక్తి- లావేరు

దసరా సెలవుల సందర్భంగా లావేరు శాఖా గ్రంథాలయంలో శుక్రవారం విశ్రాంతి ఉపాధ్యాయులు ఎం.వెంకటరమణమూర్తి చిన్నారులకు పలకలు, విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ దసరా సెలవుల్లో ప్రతిరోజు విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి కథలు చదవడం, చదివించడం, డ్రాయింగ్ వేయడం తదితర అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

టెక్కలి: టెక్కలి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న దసరా సెలవుల శిబిరంలో భాగంగా విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎల్.జయకృష్ణ, సుమారు రూ.2 వేలు విలువ చేసే పుస్తకాలను శుక్రవారం గ్రంథాలయాధికారిణి బి.రూపావతికి అందజేసారు. వివిధ రకాల పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులకు ఈ పుస్తకాలు ఆందుబాటులో ఉంటాయన్నారు. గ్రంథాలయాభివృద్ధిలో భాగంగా ప్రజా భాగస్వామ్యం అవసరమని గ్రంథాలయాధికారిణి రూపావతి అన్నారు. శిబిరంలో భాగంగా హాజరయ్యే విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

శ్రీకాకుళం అర్బన్: గ్రంథాలయంలో నిర్వహిస్తున్న శిక్షణా శిబిరంలో భాగంగా బలగ హడ్కో కాలనీలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను ఆధ్వర్యాన పిల్లలకు కథల పుస్తక పఠనం, క్యారమ్స్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటుగా క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలన్నారు. తొలి రోజు పోటీల్లో ప్రథమ బహుమతి ఎం.నిఖిల్, ద్వితీయ బహుమతి డి.జోగేంద్రసాయికి అందజేశారు.

టెక్కలి : పుస్తకాలను పంపిణీ చేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు

పాలకుల నిర్లక్ష్యంతో రైతులకు ఇబ్బందులు

ప్రజాశక్తి- పలాస

జిల్లాలో పాలకులు, అధికారులకు ముందు చూపు లేకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. కాశీబుగ్గ సూర్య కాలనీలో శుక్రవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పాలకవర్గాలు సాగునీటి ప్రాజెక్టులపై చర్చ జరపకుండా, చెరువులు, చెక్‌డ్యాంలు నిర్మించక పోవడంతో పంట భూములకు సాగునీరు అందకుండా పోతుందన్నారు. మందస మండలంలో సంకుజోడు, డబారుసింగ్, కళింగ దళ్, దామోదర్ సాగరం వాటి నీటి సామర్థ్యం పెంచే వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ వాటిని ప్రభుత్వం వినియోగించ లేకపోతున్నారని, వాటిని అభివృద్ధి చేసి పంట భూములకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, అరుణోదయ జిల్లా కార్యదర్శి కె. సోమేశ్వరరావు, పిఒడబ్ల్యు ఈశ్వరమ్మ, పి.షన్ముఖు, సరస్వతి, ఆనందం పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాధవరావు

బస్సుయాత్రను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఈ నెల 26న జరగనున్న సామాజిక న్యాయయాత్రలో మహిళా సంఘాలు భాగస్వామ్యం కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో అర్‌పిలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రతీ పథకం పారదర్శకంగా అందేలా చూడాలని, స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన పూర్తిస్థాయిలో కల్పించాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో మహిళలందరికీ 26న జరగబోయే సామాజిక న్యాయయాత్రలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టౌన్ జెసిఎస్ కన్వీనర్ సాలిన ఢిల్లీ, వైసిపి పట్టణ అధ్యక్షుడు ప్రకాష్ పట్నాయక్, మెప్మా అధికారి జానకీరావు, సిఒలు బాలరాజు, సంతోష, అర్‌పిలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

వ్యాపారవేత్త రాజేష్ మృతిపై అనుమానాలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

గత నెల 29న అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన యువ వ్యాపార వేత్త ప్రత్తి రాజేష్ మృతిపై అనేక అనుమానాలు కలుగుతున్నాయని ఉన్నత స్థాయి అధికారులతో సమగ్ర విచారణ చేపట్టాలని జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం జనసేన కార్యాలయంలో మృతుడు రాజేష్ కుటుంబ సభ్యులు, తల్లి ప్రత్తి విమల పార్వతి, సోదరుడు ప్రత్తి నరేశ్ కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. అందరితో కలుపుగోలుగా ఉంటూ ఎవరికి ఎటువంటి సహాయం కావాలన్న నేనూ ఉన్నానంటూ ఆదుకునే రాజేష్ అప్పుల భారంతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీస్ కేసు నమోదు కావడం దురదృష్టకరమన్నారు. ఆత్మ హత్య చేసుకున్న వ్యక్తికి బలమైన గాయాలు ఎలా అయ్యాయని, శరీరంపై ఆసిడ్ లాంటి ద్రవం పడుతే ఎలా బొబ్బలు వస్తాయో శరీరం అంతా కమిలిపోయి ఉండడం అనేక అనుమానాలు కలుగుతున్నాయన్నారు. తల్లి ప్రత్తి విమల పార్వతి, సోదరుడు ప్రత్తి నరేశ్ కూడా మృతిపై అనుమానాలు ఉన్నాయన్నారు. ఎస్‌పికి స్వయంగా కలిసి తన బిడ్డ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరడం జరుగుతుందన్నారు. ఈ న్యాయ పోరాటంలో రాజేష్ మృతిపై ఉన్న మిస్టరీ చేదించే విషయంలో తనపై కూడా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని దాసరి రాజు తెలిపారు. సమావేశంలో జనసేన నాయకులు రోకళ్ల భాస్కరరావు, దూగాన దివాకర్, అంగన సురేష్, హేమ చలపతి, నాగరాజు, సతీష్, దుర్యోధన పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న దాసరి రాజు

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి - పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో చినబాడాం గ్రామానికి చెందిన కోరాడ సూర్యనారాయణ మూర్తి, సూది కొండ గ్రామానికి చెందిన బలగ అమ్మాయమ్మ ఇటీవల మృతి చెందడంతో మాజీ మంత్రి గౌతు శివాజీ, మాజీ మున్సిపల్ చైర్మన్ వజ్జ బాబూరావు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులకు అడిగి తెలుసుకున్నారు. వారితో పాటు టిడిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు బి.నాగరాజు, సైని వల్లభ, టిడిపి నాయకులు ఉన్నారు.

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకుందాం

వజ్రపుకొత్తూరు : గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని గరుడభద్ర సర్పంచ్ గూడ గిరిజ ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం గ్రామ అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పారిశుధ్య పనులును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దసరా ఉత్సవాలు గ్రామాల్లో జరుపుకోవటం కోసం పల్లెలు సుందరంగా తీర్చి దిద్దాలని కోరారు. జెసిబి, కూలీల సహకారంతో గ్రామంలో పరిసరాలు శుభ్రం చేశారు. అనంతరం పంచాయతీ పరిధిలో ఉన్న అన్నీ గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గరుడ భద్ర గ్రామ సంఘం అధ్యక్షులు వై. ధర్మారావు, యువజన సంఘం అధ్యక్షులు వై.సంతోష్ కుమార్, వై ఆనందరావు, ఎన్.కోటేశ్వరరావు, చెల్లురు ధనరాజ్, ఎన్.ఆదినారాయణ, కె.అప్పన్న, కె.వెంకటేష్, చినబాబు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి

కవిటి : మండల కేంద్రంలో పలు డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని జనసేన నాయకుడు లోళ్ల రాజేష్ కోరారు. ఈ మేరకు స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం రాజేష్ మాట్లాడుతూ ఇటీవల కవిటిలో నూతనంగా డ్రైనేజీ వ్యవస్థ నిర్మించడం శుభ పరిణామమైనా దాని కోసం తీసిన మట్టి ఎక్కడికక్కడే ఉండిపోవడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. అలాగే స్టేట్ బ్యాంకు వెనుక ఉన్న పల్లివీధిలో గత కొంతకాలంగా డ్రైనేజీలో పూడికలు తీయకపోవడంతో స్థానికులు సమస్యలు ఎదుర్కొంటున్నారని, చాలామంది అనారోగ్యానికి గురవుతున్నట్టు రాజేష్ తెలిపారు. ఈయనతో పాటు ఎంపిటిసి పూడి నీలాచలం, ఇఒ వీరభద్ర స్వామి, జన సైనికులు ప్రశాంత్, పృథ్వి పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న రాజేష్

14 మందిపై కేసు నమోదు

కోటబొమ్మాళి: మంగళవారం రాత్రి కొత్తమ్మతల్లి ఉత్సవాలు నేపథ్యంలో జెయింట్‌వీల్ వద్ద జరిగిన ఘర్షణకు సంబంధించి శుక్రవారం మరో 14 మందిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ షేక్‌మహ్మద్‌అలీ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే పాకివలస గ్రామానికి చెందిన తోట సింహాచలం తన కుమారుడుపై దాడి జరిగిందని ఇచ్చిన పిర్యాదు మేరకు శుక్రవారం సంబంధిత వ్యక్తులను స్థానిక పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్తుండగా పోలీస్‌స్టేషన్ సమీపంలో పాకివలస గ్రామానికి చెందిన తోట అజయ్, పైల కార్తీక్, దేవాది జగదీష్, తోట జయతేజ, పైల శ్రీకాంత్, దండాసి సింహాచలం, దేవాది కొత్తరాజు, జలుమూరు సాయి, జోగి రమేష్, కోతి కృష్ణారావు, కాళ్ల సింహాచలం, జోగి రామదాసు, తోట రామకృష్ణ, ఉర్జాన రామకృష్ణలు అడ్డగించి పోలీసులను సైతం లెక్కచేయకుండా దాడికి పాల్పడ్డారని, ఈ దాడిలో కానిస్టేబుల్‌కు సైతం గాయపడగా స్థానిక సామాజిక అసుపత్రికి చికిత్స కోసం తరలించి ఈ 14 మందిపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

పొందూరు: పొందూరు రైల్వేస్టేషన్ సమీపంలో రైలునుంచి జారిపడి పొందూరుకు చెందిన అల్లంశెట్టి నాగరాజు(47) మృతి చెందినట్లు జిఆర్‌పి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. విశాఖపట్నం నుంచి పొందూరు రైలులో వస్తుండగా గురువారం రాత్రి రైలునుంచి జారిపడటంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. వ్యాపారరీత్యా విశాఖపట్నం వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈయనకు భార్య జానకి, ఒక అమ్మాయి, అబ్బాయి ఉన్నారు. శుక్రవారం రైల్వే పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు

అరసవల్లిని సందర్శించిన ఎంపీ

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని తెలంగాణ రాష్ట్ర మెదక్ ఎంపీ కె.ప్రభాకర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతించారు. స్వామి వారి సేవల్లో పాల్గొన్న అనంతరం శేషవస్త్రాన్ని కప్పి, జ్ఞాపికను ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యలు అందజేశారు.

ఎంపీకి మాజీ సైనికుల వినతి

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

మాజీ సైనికుల సమస్యలు పరిష్కరించి, సంక్షేమానికి తోడ్పాటు అందించాలని మాజీ సైనికోద్యోగుల సంఘం చైర్మన్, కెప్టెన్ పి.ఈశ్వరరావు, అధ్యక్షులు కె.పూర్ణచంద్రరావు కోరారు. నగరంలోని ప్రజాసదన్‌లో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఇప్పటికే 14 మండలాల్లో కమిటీలు ఏర్పాటు చేశామని, అయితే పూర్తిస్థాయిలో సమావేశాలు నిర్వహించుకునేందుకు ప్రస్తుతం అసోసియేషన్ భవనంలో సౌకర్యాల్లేక ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. ఈభవనాన్ని ఆధునికరించేందుకు నిధులు సమకూర్చాలని కోరారు. సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారాన్ని అందిస్తానని ఎంపీ హామీనిచ్చారు.

ఎస్ఇని కలసిన బిసి నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

ఎపి ఇపిడిసిఎల్‌లో విధులు నిర్వహిస్తున్న బిసి ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పి.చంద్రపతిరావు కోరారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఇపిడిసిఎల్ ఎస్ఇ కృష్ణమూర్తిని శుక్రవారం ఆయన ఛాంబరులో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కె.రంగాజీ దేవ్, కార్యదర్శి ఎ.రాంబాబు, బిసి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జామి చిన్నికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న సూర శ్రీనివాసరావు

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి-ఎచ్చెర్ల

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో మండలంలోని కుశాలపురంలో దుర్గాదేవి మండపంలో ఐదో రోజున సరస్వతి దేవి అవతారంలో వేడుకలను నిర్వహించారు. ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువతికి గాయాలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటి సమీపంలో జాతీయరహదారిపై శుక్రవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో టెక్కలి సారివీధికి చెందిన జ్యోతికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే జ్యోతి కొత్తమ్మతల్లి ఉత్సవాలకు వచ్చి యాత్ర ముగించుకొని తిరుగు ప్రయాణంలో రోడ్డు దాటుతుండగా టెక్కలి నుంచి నరసన్నపేట వైపు వెళ్తున్న బొలోరో లగేజీవ్యాన్ ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో జ్యోతి తలకు బలమైన గాయాలు కాగా, చేతికి గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించి వైద్యులు సూచనలు మేరకు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా పరిస్థితి విషమించటంతో విశాఖపట్నం కెజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు స్థానిక పోలీసులు లక్ష్మణరావు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తికి జీవిత ఖైదు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మహిళ మృతి కేసులో ఒడిశాకు చెందిన సవర రమేష్‌కు జిల్లా కోర్టు శుక్రవారం జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెల్లడించింది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. 2019 డిసెంబర్ 29న జోడూరు సమీపంలోని ఆఫ్‌షోర్ కెనాల్‌లో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు అప్పటి మెళియాపుట్టి ఎస్ఐ సిద్ధార్థ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. చనిపోయిన మహిళ సారవకోట మండలం ఆలుదు గ్రామానికి చెందిన దండు జయంతిగా గుర్తించారు. ఆమె మృతికి కారణమైన ఒరిస్సాకి చెందిన గజపతి జిల్లా వలకభద్ర గ్రామానికి చెందిన సవర రమేష్‌ను అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి శ్రీకాకుళం ఇన్‌చార్జ్ అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు నిందితునికి జీవిత ఖైదు మరియు రూ.2వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్ఐ నరసింగరావు తెలిపారు.

'ఆరోగ్య సురక్ష'తో ప్రజారోగ్యానికి భరోసా

లావేరు : స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

ప్రజాశక్తి- లావేరు

ప్రభుత్వం ప్రజలందరికి ఉచితంగా అందజేస్తున్న ఆరోగ్య సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నమురపాక గ్రామ సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతీ ఇంటికి వెళ్లి ప్రాథమిక వైద్య పరిక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, ఎంపిడిఒ కుప్పిలి సురేష్ కుమార్, సర్పంచ్ మీసాల పార్వతి, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనువాసురావు, వైస్‌ఎంపిపి ఎల్.శ్రీనువాసురావు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: మండలంలోని కోష్ట గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, మండలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్ల వెంకటరెడ్డి, వైస్ ఎంపిపి రాయపురెడ్డి బుజ్జి, వైస్ ఎంపిపి ప్రతినిధి మైలపల్లి కామరాజు, మండల మహిళా అధ్యక్షురాలు గురాన మానస, కోష్ట పంచాయతీ సర్పంచ్ పిసిని హరిబాబు పాల్గొన్నారు.

పొందూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తాడివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సీపాన హరిహరరావు, ఇఒపిఆర్‌డి సింహాచలం, వైసిపి మండల జెసిఎస్ బాడాన వెంకట కృష్ణారావు, వైసిపి రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి బందారు జై ప్రతాప్ కుమార్, వైసిపి పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు, ఉప సర్పంచ్ గోవిందరావు, ఇఒ రమేష్, వైద్యాధికారులు జి.రమేష్ నాయుడు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోగల యలమంచిలి పంచాయతీ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి కిల్లి కృపారాణి, ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, మండల వైసిపి అధ్యక్షుడు నూక సత్యరాజు, వైసిపి నాయకులు కిల్లి రామ్మోహన్‌నాయుడు, హనుమంతు గోవిందరావు, కవిటి రామరాజు, సర్పంచ్ కవిటి అమ్ములమ్మ, డిటి ఆర్. మధు, ఇఒపిఆర్‌డి బొడ్డేపల్లి రామారావు పాల్గొన్నారు.

టెక్కలి: నర్సింగపల్లి గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం జగన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నర్సింగపల్లి ఎంపిటిసి రౌతు బృందావతి, సర్పంచ్‌లు రౌతు జయమోహన్, బందపల్లి రాకేష్, ఎంపిపి ప్రతినిధి ఆట్ల రామలక్ష్మీమర్, జన్ని చంద్రరావు, సిగిలిపల్లి మోహనరావు, పోలాకి వసంతరావు, రౌతు బాలరాజు, పెద్దింటి లచ్చయ్య, తోట నారాయణ, రట్టి బైరాగి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : మందులు పంపిణీ చేస్తున్న కృపారాణి

పోలాకి: చీడివలస సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగినాయుడు, మండల వైసిపి కన్వీనర్ కణితి కృష్ణారావు, వైసిపి యువజన విభాగం అధ్యక్షుడు ఆర్.త్రినాథరావు, సర్పంచ్ ప్రతినిధి ముద్దాడ రాము, చింతు రామకృష్ణ, ఆర్.అప్పన్నరాజు, కె.లక్ష్మణరావు, వైద్యులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని భరణికోట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి. సరోజిని, స్థానిక సర్పంచ్ సవర నీలమ్మ, రంగారావు, ఎంపిటిసి ఎస్. రవికుమార్, ఇఒపిఆర్‌డి తారకేశ్వరి, ఆర్ఐ వైకుంఠరావు, వైద్యాధికారులు హేమంత, లక్ష్మి, పావని, హరీష్, వాసుదేవ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని పాజుల్‌బాగ్‌పేట, ఇప్పిలి వీధి, శ్రీకాకుళం మండలం గూడెంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈశిబిరాలను వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు సందర్శించి రోగులను పరామర్శించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస : పట్టణంలో రోడ్డు క్రాసింగ్ లైన్స్ పొడవాటి స్తంభాలు వేయడం, తీగలు అమర్చడం వంటి పనుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని పట్టణ విద్యుత్ శాఖ ఎఇ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పాల పోలమ్మ గుడి, కోర్టు, మున్సిపల్ ఆఫీస్, గవర్నమెంట్ జూనియర్ కాలేజీ రోడ్డు, ఎల్ఐసి ఆఫీసు, కృష్ణాపురం కొంత భాగం విద్యుత్ సరఫరా నిలిపివేయబడినని తెలిపారు. ప్రజలందరు ఈ అసౌకర్యాన్ని గమనించి విద్యుత్ శాఖ వారికి సహకరించాలని కోరారు.

నగదు అందిస్తున్న ప్రిన్సిపాల్ సుబ్బారావు

మేము సైతం...

కవిటి: అరుదైన వ్యాధితో బాధపడుతున్న కవిటి మండలం మాణిక్యపురం గ్రామానికి చెందిన అరవ్ బిసాయికి మేము సైతం అండగా ఉంటామని కవిటి బడగల శంకరరావు డిగ్రీ కళాశాల, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు తెలిపారు. ఈ మేరకు అరవ్ కుటుంబ సభ్యులకు శుక్రవారం రూ.5,700 నగదు అందించారు. కార్యక్రమంలో బిఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ జల్లు సుబ్బారావు, పాపారావు మాస్టర్, అన్నవరం హెల్పింగ్ హేండ్స్ సభ్యులు గోపి, రాజేష్, సిద్ధు, దినేష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో 'బాబుతో నేను'

పొందూరు : మండలంలోని పలు గ్రామాల్లో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఆయనకు మద్దతుగా శుక్రవారం టిడిపి నాయకులు బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని భగవాన్ దాస్ పేట గ్రామంలో టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు గాడు నారాయణరావు, ఎంపిటిసి-4 బాడాన హరిక ఆధ్వర్యంలో బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, అరాచక విధానాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వి.రామలక్ష్మీనాయుడు, రామప్పుడు, రమణ, వెంకన్న పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి

సీతంపేట : మండలంలోని మర్రిపాడు నుండి పూతిక వలస రహదారి దారుణంగా ఉంది. ప్రభుత్వం వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. తిరుపతి రావు, మండల కార్యదర్శి ఎ.భాస్కరరావు డిమాండ్ చేశారు. 550 మంది బాలిక హాస్టల్, 45 గిరిజన గ్రామాలకు అవసరమైన ఈ రోడ్డు మూడేళ్లగా అధ్వానంగా తయారైందన్నారు. ముగ్గురు ఐటిడిఎ పిఒలు మారిన రోడ్డు పరిస్థితి మారలేదని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ రోడ్డు పనులు చేపట్టి గిరిజనులను ఆదుకోవాలని కోరారు. లేకుంటే ఐటిడిఎ వద్ద పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

హమాలీలకు బోనస్ చెల్లించాలి

పార్వతీపురం రూరల్ : జిల్లాలోని సివిల్ సప్లై కార్పొరేషన్ పరిధిలో గల 7పాయింట్లలో పనిచేస్తున్న దాదాపు 300 మంది హమాలీలకు ఆగస్టు, సెప్టెంబర్ నెలల కూలీ రేట్లు, ఎగుమతి దిగుమతి ఛార్జీలు, దసరా బోనస్, స్వీట్ పాకెట్లు అందజేయాలని ఎపి సివిల్ సప్లై హమాలీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.కామేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక సిపిఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ దసరా బోనస్ గూర్చి ఆదేశాలు వచ్చి 15రోజులైనా ఇంతవరకు అమలు చేయకపోవడం అన్యాయమని తెలిపారు. దీంతో పాటు యూనిఫారాలిచ్చి, వారికి కుట్టు కూలీ డబ్బులు ఇవ్వలేదన్నారు. హమాలీలకు ఇచ్చే కూలీ డబ్బులు ఇవ్వడంలో అధికారులు ప్రతిసారి ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు.

అరెస్టు అప్రజాస్వామికం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సిపిఎస్ రద్దు చేయాలని కోరుతూ శాంతియుతంగా పలాసలో నిరవధిక దీక్ష చేస్తున్న యుటిఎఫ్ నాయకులను, ఉపాధ్యాయులను పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్దనరావు ఖండించారు. శుక్రవారం పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు వైసిపి ప్రభుత్వం సిఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. తమ నిరసనలు శాంతియుతంగా తెలియజేస్తుంటే పోలీసులు ఈ విధంగా అరెస్టు చేయడం అన్యాయమని దీనిని పెన్షనర్ల సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తూ దీక్షలు చేస్తున్న ఉపాధ్యాయులకు తమ సంఘీభావాన్ని తెలియజేసింది. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు బొడ్డేపల్లి మోహనరావు, కోశాధికారి హెచ్‌వి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్ మేళా

భామిని: ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా భామినిలోని శ్రీ మన్నన్నారాయణ గ్రామీణ మిత్రక్ హెచ్‌పి గ్యాస్ కార్యాలయంలో ఉచిత గ్యాస్ కనెక్షన్ మేళా నిర్వహించారు. గతంలో ఏ గ్యాస్ కనెక్షన్ లేని వారికి, కొత్తగా రేషన్ కార్డు కలిగిన వారికి ఉచితంగా గ్యాస్ బండ, రెగ్యులేటర్, గ్యాస్ స్టవ్‌తో కూడిన గ్యాస్ కనెక్షన్ అందజేస్తున్నామని, ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్ పొందిన వారికి తర్వాత గ్యాస్ బుకింగ్‌లో రూ.500 వరకు సబ్సిడీ లభిస్తుందని, ఉచిత గ్యాస్ కనెక్షన్ కావాల్సిన వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్‌తో గ్యాస్ ఆఫీస్‌లో సంప్రదించాలని గ్యాస్ యజమాని కోరాడ రాజేష్ తెలిపారు.

విద్యార్థుల దసరా సందడి

కోటబొమ్మాళిలో విద్యార్థుల ప్రదర్శన

ప్రజాశక్తి- కోటబొమ్మాళి, నందిగాం

అంతరించిపోయిన సంస్కృతికి అంకురార్పణ చేసిన కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు శుక్రవారం వీధుల్లో తిరుగుతూ పాత తరాన్ని గుర్తించేశారు. 25 సంవత్సరాల క్రితం పాఠశాల ఉపాధ్యాయులు పిల్లలతో కలిసి బాణాలతో పువ్వులు విసిరి దసరా పాటలతో వీధుల్లో తిరిగితే గ్రామస్తులు, పిల్లలను తమ ఇంటివద్దకు పిలిపించుకొని దసరా పాటలు పాడించుకొని, చిన్నారుల దీవెనలు పొందితే సిరిసంపదలు, భోగభాగ్యాలు, ఆయురారోగ్యాలతో ఉంటామని విశ్వసించేవారు. కానీ ఈ ఆధునిక కంప్యూటర్, చరవాణి యుగంలో పాత సంస్కృతి, సంప్రదాయాలు మట్టికలిసిపోయాయి. కొత్తపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకి చెందిన పిల్లలు సరస్వతీ పూజ అనంతరం నేటి కాలంలోని ఆధునికతను దసరా పాటలకు జోడిస్తూ సామాజిక చైతన్యం కలిగించేలా అనాటి కాలాన్ని గుర్తు చేస్తూ సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు, మాయమైపోయాడు మనగాంధీ తాత అంటూ పాటలను వీధుల్లో వేషధారణలో తిరిగి పూలతో బాణాలు వేసి ఆకట్టుకున్నారు. చిన్నారులను మెచ్చి ఇచ్చిన కానుకలను తాము క్రీడా సామగ్రి కొంటామని విద్యార్థి నాయకులు చక్రి, లావణ్య తెలియజేశారు. అలాగే వీధుల్లో పిల్లలతో పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ జుట్టు సింహాచలం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డోకి సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు షణ్ముఖరావు, గోపి, గోవిందరావు గ్రామస్తులు, విద్యార్థులు ఉన్నారు.

నందిగాం : దసరా వచ్చిందంటే విద్యార్థులు, ఉపాధ్యాయులు సరస్వతీ పూజ, రోజు ధనస్సులు పట్టుకొని విద్యార్థుల ఇళ్లకు గ్రామంలో కలియతిరిగి దసరా పాటలతో అలరించేవారు. అయితే అది మరుగుపడిందన్న సమయంలో పెద్ద తామరపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బాలల శంకరరావు ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులంతా ధనస్సులతో, పాటలతో, గ్రామంలో తిరిగి అందరిని అబ్బురపర్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.కుమారి, సునీత, తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

నందిగాంలో విల్లు, బాణాలతో విద్యార్థులు

భువనేశ్వరికి విజయలక్ష్మి సంఘీభావం

ప్రజాశక్తి- ఆమదాలవలస

చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుపై ఆయన సతీమణి నారా భువనేశ్వరికి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి సంఘీభావం తెలిపారు. శుక్రవారం రాజమండ్రిలో భువనేశ్వరిని కలిసి ఆమెకు మద్దతు తెలుపుతూ తమ పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని ఆమెకు తెలిపినట్లు వివరించారు. రాబోయే రోజులలో తెలుగుదేశం పార్టీ నిర్వహించే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటామని తెలిపినట్లు వివరించారు. తొందరలోనే నారా భువనేశ్వరి చేపట్టే "నిజం గెలవాలి" కార్యక్రమాన్ని విజయవంతం చేసి తమవంతు పాత్ర పోషించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి లీగల్ సెల్ వైస్ ప్రెసిడెంట్ కిల్లి మార్కండేశ్వర రావు, విజయనగరం టిడిపి లీగల్ సెల్ మెంబర్ సనపలహరి తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరిని కలిసిన కణితి విజయలక్ష్మి